పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# జిల్లాలో వయోజన అక్షరాస్యత పరీక్షలో నూరు శాతం పైగా ఉత్తీర్ణత

## -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం మర్చి 17 ప్రభాతవార్త : అక్షరాంధ్రా కార్యక్రమంలో భాగంగా మార్చి,15 ఆదివారం రోజున నిరక్షరాస్య వయోజనుల కోసం ప్రాథమిక స్థాయి భాష మరియు గణిత నైపుణ్యాల అంచనా పరీక్ష ను పశ్చిమగోదావరి జిల్లాలో సమర్ధవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం పి.జి.ఆర్.ఎస్ సమావేశంలో తెలియచేశారు. ఈ పరీక్షకు మొత్తం 68,865 మంది నమోదు చేసుకోగా, వారిలో 68849 మంది ఆదివారం పరీక్షకు హాజరయ్యారని, 16 మంది వివిధ కారణాలతో గైర్హాజరు అవ్వడం జరిగిందని తెలిపారు. పరీక్షకు హాజరైన 68,849 మంది ఉత్తీర్ణత సాధించి, 100% శాతం విజయం సాధించారన్నారు. గత సంవత్సరం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన "అక్షరాంధ్ర" కార్యక్రమంలో భాగంగానే ఈ ఏడాది అక్షరాంధ్ర పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పరీక్ష అయిపోయిన తర్వాత కూడా ఆయా డిపార్ట్మెంట్లు వారు రెగ్యులర్గా క్లాసులు నిర్వహించాలని , ప్రభుత్వం ఇచ్చినటువంటి వీడియో పాఠాలు ద్వారా మహిళలకు అవగాహన కల్పించాలని సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులకు తెలియజేశారు. అక్షరాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయుటలో వయోజన విద్యా జిల్లా నోడల్ అధికారి కెవివి సత్యనారాయణ అద్భుతంగా పనిచేశారని సమావేశంలో కలెక్టర్ ప్రశంసించారు. అలాగే లైన్ డిపార్ట్మెంట్లు అయినటువంటి పీడీఆర్డీఏ మరియు పిడి డ్వామా, పీడీ మెప్మాను కూడా ప్రశంసించారు. జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి అర్హుడికి అక్షరాస్యత కల్పించే దిశగా ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే ఈ అక్షరాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయుటలో



సహకరించినటువంటి ముందుండి నడిపించినటువంటి జిల్లా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయిలో పనిచేసినటువంటి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు అందరికీ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియ చేశారు.

# వేసవిలో ఎండ తీవ్రతను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

## -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం మర్చి 16 ప్రభాతవార్త :రాబోయే వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. పీజీఆర్ఎస్ అనంతరం రెవెన్యూ, విద్యాశాఖ, పోలీస్, సమాచార పౌర సంబంధాల శాఖ, ఫైర్, డీఆర్డీఏ, మెప్మా, ఆర్టీసీ, సర్వే, లేబర్, స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ వేసవిలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వడదెబ్బ కారణంగా ఒక్కరికైనా హాని జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు అధికంగా రాకపోకలు చేసే ముఖ్య కూడళ్ళు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, పాఠశాలలు వంటి ప్రదేశాలను గుర్తించి అక్కడ తాగునీటి సదుపాయం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అవసరమైన చోట్ల చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఎండ తీవ్రతకు గురికాకుండా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ



అధికారులు తగిన బస్సు సర్వీసులు నడపాలని సూచించారు. విద్యార్థులు ప్రయాణించే ప్రధాన రూట్లలో తాగునీటి సదుపాయం కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీల పరిధిలో కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, లయన్స్ క్లబ్ వంటి సేవా సంస్థల సహకారంతో త్రాగునీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే కార్మికులకు తాగునీటి కొరత లేకుండా ఏర్పాట్లు చేయాలని, వడగాలుల నుండి రక్షణకు అవసరమైన సూచనలు ఇవ్వాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ వేసవిని దృష్టిలో ఉంచుకుని తగిన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎవరైనా ఎండ తీవ్రత కారణంగా అస్వస్థతకు గురైతే అత్యవసర వైద్య సేవలు వెంటనే అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. పశువులు తాగేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ శాఖ ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ప్రజలకు ఎండ తీవ్రతపై అప్రమత్తత సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఇరగవరం మండలం టిడిపి అధ్యక్షుడిగా బొంతు శ్రీనివాస్

## అభినందన సభలో పాల్గొన్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

ఇరగవరం, మార్చి 16 ( ప్రభాత వార్త) : తెలుగుదేశం పార్టీ ఏర్పడి 43 సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాలు, విద్యావంతులకు, మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించి తెలుగుదేశం పార్టీ విజయం నిరంతరం ఉండే విధంగా పటిష్టమైన కార్యకర్తల వ్యవస్థను నిర్మాణం చేయడం అభినందనీయమని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఇరగవరం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా బొంతు శ్రీనివాస్ నియమితులైన సందర్భంగా సోమవారం ఇరగవరంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో యువతకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా కమిటీలో వారికి ప్రాధాన్యత కల్పించామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న ప్రజల పక్షాన తెలుగుదేశం పార్టీ నిలబడుతుందని అన్నారు. చంద్రబాబు నాయుడు పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే విధంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తూ ప్రజా జీవితంలో బాధ్యతలను గుర్తు చేస్తూ పార్టీ నిర్మాణ పునాదులను పటిష్టం చేసే విధంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తు నాయకుడు నారా లోకేష్ నాయకత్వంలో కార్యకర్తలు నాయకులు నడుచుకునే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ప్రతి రెండేళ్లకోసారి సంస్థాగత నిర్మాణం చేసుకుంటామని ఇటువంటి సంస్థ గత నిర్మాణంలో లోకేష్ చేస్తున్న సూచనలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళుతున్నారని చెప్పారు అభివృద్ధి ఫలాలను క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేయాల్సిన బాధ్యత గ్రామ మండల స్థాయి నాయకుల దయనని స్పష్టం చేశారు. ఇరగవరం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా బొంతు శ్రీనివాసు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంలో కృషిచేసిన



నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే రాధాకృష్ణ అభినందించారు. అనంతరం శ్రీనివాసును ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న నేత ఎమ్మెల్యే నాయకర్

## - నీరసాపురం గా మార్చిన ఘనత వైసీపీ దే - జనసేన నాయకుల విమర్శ

నరసాపురం ప్రభాతవార్త : నరసాపురం జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో నరసాపురం మండల అధ్యక్షులు ఆకన చంద్రశేఖర్, జనసేన నాయకులు వర్ధనపు ప్రసాద్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మత్స్యకార సహకార సంఘాల చైర్మన్ మైలా వసంతరావు, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ వలవల నాని, డెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ గుబ్బల మార్రాజు, మొగల్తూరు సొసైటీ అధ్యక్షులు నిప్పులేటి తారక రామారావు, మాజీ ఎంపీపీ వాతాడి కనకరాజు, మాజీ ఎంపీటీసీ ఈద జోన్స్ మరియు వార్డు కౌన్సిలర్ కొప్పాడి కృష్ణవేణి పాల్గొని గడచిన రెండేళ్లలో జరిగిన అభివృద్ధిని నాయకర్ కృషిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 21 నెలల్లోనే నరసాపురం నియోజకవర్గంలో గత ప్రభుత్వం ఐదేళ్లలో చేయని అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కాలువల పూడికతీత, రహదారుల అభివృద్ధి వంటి పనులు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడ్డాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాటికి ప్రాధాన్యత ఇచ్చి పనులు వేగంగా చేపడుతున్నామని పేర్కొన్నారు.అలాగే గత 10 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న నవరసపురం రోడ్డుకు రూ.2.60 కోట్ల నిధులతో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అనేక ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులకు గ్రాంట్లు తెప్పించడంతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా గతంతో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో చెక్కులు అందజేశామని చెప్పారు.ఈ సందర్భంగా మైలా వసంతరావు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో నరసాపురాన్ని "నీరసాపురం"గా మార్చారని విమర్శించారు. ఎక్కడబడితే అక్కడ సెటిల్మెంట్ బాగోతాలు జరిగాయని ప్రజలందరికీ తెలుసని, వాటిని కప్పిపుచ్చుకునేందుకే జనసేన నాయకులు మరియు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.రాజకీయాల్లోకి ఎంతో మంది వస్తుంటారని, కొంతకాలం తర్వాత కనుమరుగైపోతారని,



అయితే ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చి సంకల్పబలంతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే నాయకులు చాలా కొద్దిమందే ఉంటారని అన్నారు. అలాంటి నాయకుల కోవకు చెందినవారే నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అని తెలిపారు. ప్రజలు విశ్వాసంతో గెలిపించి ఎమ్మెల్యేగా పంపిన తరువాత నుంచి నేటి వరకు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

# త్వరలోనే లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందిస్తాం

## - టిడ్కో ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, మార్చి 16 ( ప్రభాత వార్త) :గత ఐదేళ్ల వైసిపి పరిపాలనలో జగన్ మోహన్ రెడ్డి విధ్వంస పరిపాలన చేశారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ళ నిర్మాణం కనీసం 10 శాతం పనులు పూర్తి చేయలేని దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. సోమవారం తణుకు పట్టణంలో టిడ్కో ఇళ్లు పరిశీలించి ఆయన మాట్లాడారు. తణుకు పట్టణంలో 950 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు నిర్మించి పంపిణీ చేయడానికి సిద్ధం చేశామని రాధాకృష్ణ తెలిపారు. పేద ప్రజలందరికీ మంచి ఇల్లు నిర్మాణం చేసి ఇచ్చేందుకు అప్పటి తెలుగుదేశం పార్టీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2018 -19 సంవత్సరానికి సంబంధించి టిడ్కో ఇళ్లు 90 శాతం నిర్మాణం పూర్తి చేసామని అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మిగిలిన కనీసం 10 శాతం నిర్మాణం పూర్తి చేయలేక చేతులెత్తేసారని విమర్శించారు. గత ఐదేళ్ల వైసిపి పరిపాలనలో జగన్మోహన్ రెడ్డి విధ్వంస పరిపాలనకు టిడ్కో ఇళు నిదర్శనమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో దాదాపు 90 శాతం నిర్మాణం పూర్తి చేయగలగామని అన్నారు. లబ్ధిదారులకు మంజూరు చేసిన బ్యాంకు రుణాలను సైతం గత వైసిపి పాలకులు, పక్కదోవ పట్టించారని ఆరోపించారు. ప్రస్తుతం లబ్ధిదారులు బ్యాంకు అధికారుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి టిడ్కో ఇళ్లు పునర్నిర్మాణం చేసి లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టామని హామీ ఇచ్చారు. బ్యాంకు రుణాలను సైతం ప్రభుత్వమే చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు కూటమి



నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# టెన్త్ పరీక్షలకు 98.42 శాతం హాజరు - డిఈఓ నారాయణ

భీమవరం టౌన్, మార్చి 16 : ప్రభాతవార్త :పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు తెలుగు పరీక్షకు 23415 మందికి గాను 23044 మంది హాజరు కాగా 371 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశా ఖాధికారి ఇ నారాయణ వెల్లడించారు. ఎస్ ఎస్ సి (ఎపి ఒ ఎస్ ఎస్) 2026 పరీక్షలకు సంబంధించి తెలుగు, ఉర్దూ పరీక్షలకు 240 మందికి గాను 201 మంది హాజరైనట్లు, 39 మంది గైర్హాజరైనట్లు మొత్తం 83.75 శాతం హాజరైనట్లు డీఈవో చెప్పారు. సోమవారం జరిగిన పరీక్షకు సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్ 46 కేంద్రాలను, జిల్లా కలెక్టర్ 1 కేంద్రాన్ని, జిల్లా స్థాయి పరిశీలకులు 4 కేంద్రాలను, డిఇఓ 9 కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ 3 కేంద్రాలను, జిల్లా కోఆర్డినేటర్ 3 కేంద్రాలను మొత్తం 66 కేంద్రాల తనిఖీ జరిగింది. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ ఇ నారాయణ తెలియజేశారు.

# అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు -మంత్రి హెచ్చరిక

## వార్తకు స్పందన

నూజివీడు, మార్చి16 ప్రభాతవార్త: నూజివీడు నియోజకవర్గం, 4 మండలాల్లో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా ఇస్తున్న



పట్టాదార్ పాస్ పుస్తకాలను కొంత మంది బ్రోకర్లు ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసి ఇప్పిస్తామని మోసం చేస్తున్నారనే విషయం తమ,దృష్టికి వచ్చిందని మంత్రి పార్థసారథి రెవెన్యూ, ఇతర అధికారులను హెచ్చరించారు. ఇటీవల వార్త దినపత్రికలో "నూజివీడు డివిజన్లో రెవెన్యూ అక్రమ వసూళ్లు" అనే శీర్షిక తో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి మంత్రి పార్థసారథి స్పందించారు. అంతేకాకుండా ఆయనకు వచ్చిన సమాచారం ప్రకారం సోమవారం ఆయన మాట్లాడుతూ దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. నా నియోజకవర్గంలో అధికారులు గాని, నాయకులు గాని, కార్యకర్తలు గాని ఎవరైనా సరే ప్రజల వద్ద డబ్బులు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అరక్షణం కూడా ఆలోచించను. పార్టీకి సంబంధించిన వారు తప్పు చేస్తే పార్టీ తరపున క్రమశిక్షణ చర్యలు తీవ్రంగా ఉంటాయి. కూటమి ప్రభుత్వంలో ముఖ్యంగా నా నియోజకవర్గంలో ప్రజలకు అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదు. అదేవిధంగా నియోజకవర్గంలో నా కార్యక్రమాల పేరుతో కొంతమంది డబ్బులు వసూలు చేస్తున్న విషయాలు తాజాగా నా దృష్టికి వచ్చాయి. నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు ఎవరూ ఇలాంటి వాటికి డబ్బులు ఇవ్వొద్దు. బ్రోకర్లు, మాయమాటలు చెప్పేవారి వద్ద నూజివీడు ప్రజలు మోసపోవద్దు. అప్రమత్తంగా ఉండండి. మీకు ఏ ఇబ్బంది ఉన్నా నాకు, నా కార్యాలయానికి, సిబ్బందికి తెలియజేయండి. తప్పు చేసిన వారిపై తక్షణ చర్యలు తీసుకుంటానని ఆయన మరోసారి హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడేవారు ఎంతటి పెద్ద అధికారైన సహించేది లేదన్నారు. అధికారులకు ప్రజలకు సేవ చేసినందుకు ప్రభుత్వం జీతం ఇస్తుందని దానితో సంతృప్తి చెందాలన్నారు. ప్రజల ముక్కుపిండి అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# వేలేరుపాడులో తొలి రోజు పది పరీక్షలు ప్రశాంతం

## ఆకస్మిక తనిఖీ నిర్వహించిన ఫ్లయింగ్ స్క్వాడ్

వేలేరుపాడు, మార్చి 16( ప్రభాత వార్త ): వేలేరుపాడు మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజు ఉదయం 9:30గంటల నుండి మధ్యాహ్నం 12గంటల 45నిమిషాల వరకు పరీక్షలు జరగనున్నాయి.మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఒకే ఒక్క పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ పరీక్షా కేంద్రం నందు మొత్తం 136 మంది విద్యార్థులకు గాను 132మంది హాజరుకాగా నలుగురు విద్యార్థులు గైరాజరైనట్లు అధికారులు తెలియజేశారు.పరీక్షా సమయంలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా తొలి రోజు ఫ్లయింగ్ స్పాట్ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది పరీక్ష కేంద్రాల వద్ద విధులు



నిర్వహించారు. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి తెలియజేశారు.పరీక్ష సమయానికి ముందు విద్యార్థులు తల్లిదండ్రులు దేవాలయాలను దర్శించి పది పరీక్షలు మంచిగా రాయాలని కోరుకున్నారు.

# ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

పెనుమంట్ర, మార్చి 16 (ప్రభాతవార్త) : తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకై తన ప్రాణాలను అర్పించిన అమర జీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు సోమవారం మార్టేరు మానవతా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు శిరం విశ్వనాథం, కార్యదర్శి బండి ప్రసాద్ మాట్లాడుతూ త్యాగధనుడు పొట్టి శ్రీరాములు చూపిన మార్గంలో నడవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తెలుగు ప్రజల కోసం ఆయన చేసిన ఆత్మబలిదానం చిరస్మరణీయమని, నేటి యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా ప్రతినిధి కొత్త సత్యనారాయణమూర్తి, చైర్మన్ కడలి సుబ్రమణ్యం, బండి



ప్రసాద్, కర్రి కృష్ణారెడ్డి, పడాల జగన్నాథ్ రెడ్డి, అంబులెన్స్ డ్రైవర్ గుబ్బల శ్రీను తదితరులు, సంస్థ సభ్యులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దళితులకు స్మశాన వాటిక స్థలం కేటాయించాలని మంత్రి నిమ్మలకు వినతి

పెనుమంట్ర, మార్చి 16, (ప్రభాతవార్త): మండలంలోని ఆలమూరు గ్రామంలో దళితులకు స్మశాన వాటిక స్థలం కేటాయించాలని కోరుతూ మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ జలవనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో స్మశాన వాటిక కోసం దళితులు రోడ్డెక్కి ధర్నాలు నిర్వహించాల్సి వచ్చిందన్నారు. తాత్కాలికంగా ఓదూరు--ఆలమూరు గ్రామాల మధ్య గట్టు వద్ద స్థలం కేటాయించగా అది రైతులకు కూడా ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. దళితుల కోసం శాశ్వతంగా స్మశాన వాటిక స్థలం కేటాయించాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఎస్సీ కమిషన్ జిల్లా కలెక్టర్‌కు స్థలం కేటాయించాలని లేఖ ఇచ్చినా అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్మశాన వాటిక స్థలం కేటాయించి దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని పుష్పరాజ్ కోరారు. ఈ



కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొలాటి ప్రసాద్ రావు, ఆచంట నియోజకవర్గం అధ్యక్షులు కుసుమే వెంకటేశ్వరరావు, మత వెంకటేశ్వరావు, వాసంగి శ్రీను, నీలపూడి రత్నరాజు, మల్లిపూడి ప్రసాద్, మల్లిపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

జీలుగుమిల్లి, మార్చి 16, (ప్రభాతవార్త) : మండల కేంద్రం జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్ వద్ద ఉన్న శ్రీ జగదాంబ తల్లి ట్రాలీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. యూనియన్ అధ్యక్షుడు చిట్లూరి పుల్లారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఎస్సై క్రాంతి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఆటో యూనియన్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రయాణికులు, బాటసారులు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మనోజ్, జనార్దన్, రాము, నాగరాజు, శ్రీను,




వి. శ్రీను, రవీంద్ర, నరసింహ, గోపి, ఆనంద్, వీరబాబు, చిరంజీవి, మోహన్, దేవుడు, సునీల్, యాసీన్, బోస్, రాంబాబు, వినోద్, దేవుడు శ్రీను, యేసు, సత్యనారాయణ తదితర ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# రైతులకు సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

తణుకు, మార్చి 16 ( ప్రభాత వార్త) : రైతు సంక్షేమం, రైతు గౌరవం, రైతు కుటుంబానికి భద్రత కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం ఇరగవరం మండలం యర్రాయిచెరువు గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. అన్నదాత సుఖీభవ ద్వారా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ. 20 వేలు రైతుల ఖాతాలో జమ చేశామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ఏడు రోజులపాటు రైతన్న మీకోసం కార్యక్రమం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించడానికి ప్రణాళికలు చేశామని చెప్పారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంగా రాష్ట్రాన్ని అగ్రగామిలో నిలిపే విధంగా ప్రతి రైతుకు నీటి ఎద్దడి లేకుండా సాగునీరు అందించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. సాగునీటి కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి పంటలు సమృద్ధిగా పండేందుకు నీటి వనరులు కల్పించే విధంగా భారీ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టామని చెప్పారు. ఇప్పటికే పోలవరం 75 శాతం



నిర్మాణం పూర్తి చేసుకుని 2027 నాటికి రాష్ట్ర ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా నదుల అనుసంధానంతో సాగునీరు అందించాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. రైతులకు లాభసాటి వ్యవసాయం కల్పించాలని ఉద్దేశంతో రైతులకు గిట్టుబాటు కల్పించాలని లక్ష్యంతో లాభసాటి ఆధారిత పంటలను ప్రోత్సహిస్తూ అనేక సూచనలు చేస్తూందని అందుకు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పది పరీక్షలు పారదర్శకంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈఓ తెల్లం బాబురావు అన్నారు. మండల వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షలకు సంబంధించి మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మొదటిరోజు నిర్వహిస్తున్న పరీక్షకు 605 మంది విద్యార్థులు హాజరవాల్సి ఉండగా 584 మంది విద్యార్థులు హాజరయ్యారని, 21 మంది మాత్రమే గైరాజరయ్యారని ఆయన వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.
ప్రభాతవార్త – బుట్టాయిగూడెం :



మంగళగిరి కేంద్ర కార్యాలయంలో జరిగిన టిడిపి చెప్పిన కార్యక్రమంలో పాల్గొన్న పాలకొల్లు ఎమ్మెల్యే మంత్రి నిమ్మల రామానాయుడు మత్స్య కార్మిక నాయకుడు కొల్లు పెద్దిరాజు తదితరులు.
ప్రభాతవార్త నరసాపురం

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



అత్తిలి, మార్చి 16( ప్రభాత వార్త) గాలి కుంటు వ్యాధి నివారణ కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జంతు సంక్షేమ సంఘం డైరెక్టర్ ఆల్తి అజయ్ కుమార్ కోరారు. అత్తిలి శివారు బొంతువారిపాలెంలో వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 29 వరకు నిర్వహించే టీకాల కార్యక్రమం లో పశువులకు వ్యాక్సిన్ వేయించాలని కోరారు. ప్రభుత్వం ద్వారా పశువులకు ఇచ్చే బీమా, గడ్డి విత్తనాలు, పశువుల దాణా ను రైతులకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుత వేసవికాలంలో గాలికుంటు వ్యాధి రాకుండా పశువులకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామాంజనేయులు కోరారు. కార్యక్రమంలో బొంతు నాగర్జున,మట్టపర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు వేశారు.

## టెన్త్ పరీక్షలకు 615 మంది హాజరు

అత్తిలి, మార్చి 16( ప్రభాత వార్త) అత్తిలి మండలంలో పదవ తరగతి పరీక్షలు కోసం ఏర్పాటుచేసిన ఐదు సెంటర్ల నుండి 633 మంది తెలుగు పరీక్ష రాయాల్సి ఉండగా 615 మంది పరీక్షలు రాసినట్లు మండల విద్యాధికారులు ఎన్ రమేష్,ఎం వి ఎల్ కె ప్రసాద్ తెలిపారు. 35 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ వారు అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికొన్నత పాఠశాల, కొమ్మర ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణం లో పరీక్షలు ప్రారంభమయ్యాయని,ఎటువంటి మాల్ ప్రాక్టీసు జరగలేదని తెలిపారు.

## రైతన్న మీకోసం కార్యక్రమం



అత్తిలి మార్చి 16( ప్రభాత వార్త)అత్తిలి మండలంలోని గ్రామాలలో రైతన్న మీకోసం రెండో విడతలో భాగంగా వ్యవసాయ సహాయకులు, ఇంజనీరింగ్ సహాయకులు, పశు సంవర్ధక శాఖ సహాయకులు, గ్రామ ఎనర్జీ సహాయకులు, సొసైటీ సభ్యులు, రైతులు టీం గా ఏర్పడి గ్రామంలోని ప్రతి రైతుని కలిసి వారికి ముఖ్యమంత్రి సందేశం అందజేశారు. వ్యవసాయ అనుబంధ శాఖలు పథకాలను వివరించారు. ఏఐ అనుసంధానిత రైతు యాప్ గురించి వివరించారు.. ఈ కార్యక్రమం 16 నుంచి 18 వరకు మరల 23 నుంచి 25 వరకు నిర్వహిస్తారని తెలిపారు.. రైతులందరూ వ్యవసాయ అనుబంధ శాఖల ప్రభుత్వ పథకాల గురించి పూర్తిగా తెలుసుకోవాలని కోరారు.

## రైతులకు పంచ సూత్రాలపై ప్రచారం



అత్తిలి, మార్చి 16 (ప్రభాత వార్త) అత్తిలి లో రైతన్న మీకోసం కార్యక్రమం కింద కూటమి నాయకులు రైతులను కలిసి పంచ సూత్రాలను వివరిస్తున్నారు. రైతులు పంట దిగుబడి పెంచుకోవడానికి చేపట్టాల్సిన కార్యాచరణని రైతులకు వివరిస్తున్నారు. వారు రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుందని జిల్లా జంత సంక్షేమ సంఘం డైరెక్టర్ ఆల్తి అజయ్ కుమార్ తెలిపారు. ఈ ప్రచారంలో టిడిపి నాయకులు వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# లైబ్రరీ నిర్మాణానికి త్వరలోనే చర్యలు

## గ్రంథాలయ చైర్మన్ నాగరాజు

నరసాపురం ప్రభాతవార్త : నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం ను సోమవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తుగనాగరాజు సందర్శించారు. సర్ ఆర్థర్ కాటన్ పార్క్ నందునిర్మాణంలో ఆగిపోయిన గ్రంథాలయ భవనమును చైర్మన్ శాసనసభ్యులు బొమ్మిడినాయకర్ తో కలిసి పరిశీలించారు. త్వరలో ప్రథమ శ్రేణి గ్రంథాలయ భవన నిర్మాణమును పూర్తి చేయటానికి తగు చర్యలు తీసుకుంటామ న్నారు. చైర్మన్ జుత్తుగనాగరాజు గ్రంథాలయమును సందర్శించి పుస్తకములను పరిశీలించారు... గ్రంథాలయ పాఠకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను గురించి . గ్రంథాలయం అద్దె భవనమును గూర్చి గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజే ఎస్ ఎల్ కుమారిని అడిగి తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు...వారిని గ్రంథాలయ కమిటీ పాఠకులు సన్మానించినారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు మరియు కౌన్సిలర్స్ తోట అరుణ, బొమ్మిడి సూర్య కుమారి ,నలినీ దేవి, ఆర్ సి వి రాజు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, సుధీర్ మోహన్, సూర్యం బాబు, భట్టిప్రోలు సత్యనారాయణ, డాక్టర్ అమ్మాజీ,బొమ్మిడి కృష్ణమూర్తి, గ్రంథాలయ సిబ్బంది సందీప్,బాజీ, ప్రభాకర్ గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నా రని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజే ఎస్ ఎల్ కుమారి తెలిపారు.





## రావిపాడు లో పొట్టి శ్రీరాములు జయంతి

అత్తిలి / పెంటపాడు, మార్చి 16 (ప్రభాతవార్త)రావిపాడు మోడల్ ప్రైమరీ స్కూల్ లో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ప్రధానోపాధ్యాయులు కే.కాశీ విశ్వనాథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ మహనీయుని ప్రాణత్యాగ ఫలితంగా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. ఎస్.ఎం.సి. చైర్మన్ కే.డి.ఎన్. రాజేశ్వరి మాట్లాడుతూ 58 రోజులపాటు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం నిరాహార దీక్ష చేసి, దీక్షలోనే అమరుడైన పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని, దేశభక్తిని భవిష్యత్తు తరాల వారు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయిని కే. నాగ సౌజన్య విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలు ఈ.లాస్య, టి.భవ్య శ్రీ, కే.భవితలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎం.సి. సభ్యులు దుర్గాదేవి, ఉపాధ్యాయులు వి.వి.వి. పరదేశి, మంగతయారులు పాల్గొన్నారు.



## ద్వారకాతిరుమలలో పదో తరగతి పరీక్షల సందడి

ద్వారకాతిరుమల మార్చి 16( ప్రభాత వార్త): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు నుండి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) తెలిపారు. ద్వారకాతిరుమలలోని ఎస్.వి.డి.ఓ. హెచ్ స్కూల్, రాళ్లకుంటలోని సెయింట్ జేవియర్ స్కూల్, నాగులపల్లిలోని దీపాల్ స్కూల్ లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల హడావిడి కనిపించింది. తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్షా కేంద్రాల వద్దకు తీసుకువచ్చి దింపగా, కొన్ని పాఠశాలలు తమ విద్యార్థులకు ప్రత్యేకంగా వాహన సదుపాయాలు కూడా కల్పించాయి. ఇక విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే అవకాశం కల్పించారు, దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ప్రయాణ సౌకర్యం కలిగింది. పరీక్షలు ప్రశాంతంగా సాగేందుకు పోలీస్ శాఖ తరఫున కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్, సీఐ కృష్ణ పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. మొత్తంగా ద్వారకాతిరుమల మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయని అధికారులు తెలిపారు.



## సేవలకు గుర్తింపు పొందిన ఓం ప్రకాశ్ చౌదరి

ద్వారకాతిరుమల,మార్చి16 ( ప్రభాతవార్త): ద్వారకాతిరుమల: ఎక్కువ సంఖ్యలో రక్తదానాలు నిర్వహిస్తూ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న ద్వారకాతిరుమలకు చెందిన మొగతడకల ఓం ప్రకాశ్ చౌదరికి గుర్తింపు లభించింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవనంలో ఆదివారం జరిగిన ట్రస్ట్ 29వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శాలువా కప్పి ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. సమాజ సేవలో భాగంగా అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించడం, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం పట్ల ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఓం ప్రకాశ్ మాట్లాడుతూ, "ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఇచ్చే ఈ అవార్డు తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడానికి ఇది తనకు ప్రోత్సాహం



## గ్రామాన్ని అభివృద్ధి బాట పట్టించారు

### ముత్యమాంబ బాబులు కృషితో పల్లెకు వెలుగు

నరసాపురం రూరల్ ప్రభాతవార్త : మండలంలోని ఎర్రంశెట్టి వారి పాలెం గ్రామ సర్పంచ్ ఎర్రం శెట్టి నాగ ముత్యమాంబ బాబు లు గారికి పదవీకాలం పూర్తి అవుతున్న సందర్భంగాగ్రామస్తులు సోమవారం ఘనశీగా సన్మానించినారు. గ్రామపంచాయతీలో సచివాలయం రైతు భరోసా కేంద్రం వెల్నెస్ సెంటర్ హై స్కూల్ తరగతులు అభివృద్ధి హోమియోపతి హాస్పటల్ బిల్డింగ్ నిర్మాణం స్మశాన వాటిక అభివృద్ధి పరుచుట హై స్కూల్ నందు కిచెన్ సెట్ నిర్మాణం గ్రామపంచాయతీలో 8 ట్రాన్స్ఫార్మర్లు వేసి సమస్య తీర్చడం జరిగింది. జల జీవన్ మెషిన్ తో 60 లక్షలతో ఏడు కిలోమీటర్లు పైపులైను వేసి మంచినీరు అందించడం చేశారు. ఎన్ఆర్ఈజీసీ నిధుల నుండి సిమెంట్ రోడ్లు నిర్మాణం గ్రామంలో సుమారు మూడు కిలోమీటర్లు రోడ్డుకి ఆక్రమణ తొలగించడం జరిగింది. నూతన పోస్ట్ ఆఫీస్ ప్రారంభించడం జరిగిందని పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందని దీనికి గ్రామస్తులు అందరూ సహకరించారని సర్పంచ్ నాగ ముత్యమాంబ బాబులు అన్నారు. మేము కృషి చేసిన మీరు అందించిన చేయూత ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమం గ్రామస్తులందరూ ఒక వేడుక లాగా ఘనంగా పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుబ్బుల వెంకటేశ్వరరావు పెట్ట రామారావు తలనశెట్టి శ్రీదేవి వాసు గ్రంధి జగపతి మహిళలు పాల్గొన్నారు



## సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నేడు శిక్షణ

అత్తిలి, మార్చి 16( ప్రభాత వార్త ) అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో మండలం లో గల ఎంపీటీసీ సభ్యులకు, పంచాయతీ సభ్యులకు మంగళవారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పి. శ్యామ్యూల్ తెలిపారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక కోసం ఎంపీటీసీలకు, సభ్యులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం 6:00 వరకు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో శ్యామ్యూల్ వివరించారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు.

## ఆర్యవైశ్యుల ఐక్యత.. అమరజీవి స్మరణ: విగ్రహ దిమ్మ పునఃప్రారంభం.

జంగారెడ్డిగూడెం,మార్చి 16(ప్రభాత వార్త): ఆంధ్రరాష్ట్ర సాధన కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుట్టాయిగూడెం రోడ్ నాలుగు రోడ్ల కూడలిలో ఆధునీకరించిన పొట్టి శ్రీరాములు విగ్రహ దిమ్మను సంఘ నాయకులు పునఃప్రారంభించారు. ముందుగా ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, భారీ ర్యాలీగా బుట్టాయిగూడెం సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ వందలాది మంది ఆర్యవైశ్యులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించి, 'అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. శ్రీరాములు గారి త్యాగఫలమే నేటి ఆంధ్రరాష్ట్రమని, ఆయన స్మృత్యర్థం రాష్ట్ర రాజధానిలో 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం తెలుగు జాతికి గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వందనపు వేంకటేశ్వరరావు, మహంకాళి బాలకృష్ణ, రాంబాబు, కొనకళ్ళ సోంబాబు, మండవల్లి సోంబాబు, చామర్తి శ్రీరాములు, టివిఎ రామతారకం, శీమకుర్తి శ్రీనివాసరావు,మాతు శ్రీమన్నారాయణ,మహంకాళి రంగప్రసాద్,కర్పూరం జనార్ధన్, దూబగుంట్ల బాపిరాజు, గుళ్ళపూడి శ్రీనివాసరావు,యేలూరి ఫణి,కర్పూరం గవరయ్య గుప్త,కౌన్సిలర్ మురళి,ఉప్పల గంగాధరరావు,వాసవీసాయు నగేష్,నాగసూరి వసంత్ కుమార్, కేకే బ్రదర్స్,వాసవీక్లబ్ కపుల్స్ ఉప్పలమెట్ట, వాసవీక్లబ్ గోల్డ్ సభ్యులు, ఆర్యవైశ్య యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

## పృథ్వీ హెచ్పి గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసిన జె.సి. రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం మర్చి 16 ప్రభాతవార్త : పట్టణంలోని పృథ్వీ హెచ్పి గ్యాస్ ఏజెన్సీని సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీలో రోజువారీగా జరుగుతున్న గ్యాస్ బుకింగ్ వివరాలు, అలాగే వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేసిన తేదీలను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా అక్కడ ఉన్న గ్యాస్ వినియోగదారులతో జాయింట్ కలెక్టర్ మాట్లాడి గ్యాస్ సరఫరాలో ఇబ్బందులపై ఆరా తీశారు. ప్రస్తుతం గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని వినియోగదారులు తెలియజేశారు. గ్యాస్ సిలిండర్లను బుకింగ్ చేసిన తేదీ ప్రాతిపదికగా తీసుకుని ఎక్కువ రోజులు వెయిటింగ్‌లో ఉన్న వినియోగదారులకు ప్రాధాన్యత ఇవ్వాలని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లోనూ రసీదులో పేర్కొన్న ధర కంటే ఎక్కువ ధరను వినియోగదారుల నుండి డిమాండ్ చేయరాదని స్పష్టం చేస్తూ, అలాంటి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు, ఏ ఎస్ ఓ రవిశంకర్, సి ఎస్ డి టి, వీఆర్వోలు పాల్గొన్నారు.



## అమ్మవారి వైభవం అనిర్వచనీయం:ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం టౌన్ మార్చి 16: (ప్రభాతవార్త ) : శ్రీశ్రీశ్రీబలుసులమ్మ అమ్మ వారి జాతర మహోత్సవం అత్యంత వైభవోపేతంగా, అనిర్వచనీయంగా జరుగుతుందని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో బాశంశెట్టి రామ తులసి ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిగూడెం గ్రామ దేవత బలుసులమ్మ అమ్మవారి గరగల ఊరేగింపు లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మహిళా మణులందరూ అందరూ అమ్మవారి జాతరలో అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. గరగల ఊరేగింపు అనంతరం బలుసులమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జన సైనికులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పుల్ల బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, నల్లగంచి రాంబాబు, పసల కొండ, తదితరులు పాల్గొన్నారు



## స్మశాన వాటిక వద్ద ఎన్ఆర్ఈజీఎస్ పనులు

# ఎంపిటిసి నాలి శ్రీను

జీలుగుమిల్లి, మార్చి 16, (ప్రభాతవార్త) :మండలంలోని పి. అంకంపాలెం గ్రామంలోని స్మశాన వాటిక వద్ద వద్ద ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలతో రెండు షెడ్లు నిర్మాణం, బోరు త్రవ్వకం చేపడుతున్నట్లు ఎంపీటీసీ నాలి శ్రీను తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత పి. అంకంపాలెం పంచాయతీకి సుమారు రూ. 1.20 కోట్లు నిధులు మంజూరు చేసిన ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ఆయన అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుద్ద జగ్గారావు, ఉప సర్పంచ్ పాలగాని నాగరాజు, తోట బాలు, రామాంజనేయులు, కృష్ణమూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు పొట్టి శ్రీరాములు

ఆగిరిపల్లి: మార్చి 16 ప్రభాతవార్త స్థానిక పెద్ద కొఠాయి సెంటర్‌లో గల మహాత్మా గాంధీ , పొట్టి శ్రీరాములు విగ్రహాల వద్ద సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతోత్సవాన్ని ఆగిరిపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చలవాది వెంకటరత్నం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను అర్పించిన మహానుభావుడని, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం చేసిన ఆయన నిరాహార దీక్ష చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు. ఆయన త్యాగం తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పటికీ అజరామరంగా నిలిచిపోతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎం. శివరామమూర్తి, పాలూరి ప్రసాద్, జే. మారుతి, జే. వేణు, వై. రమేష్, సత్తు కోటేశ్వరరావు, పాతూరి రవి తదితరులు పాల్గొన్నారు.



## వేలేరుపాడులో తొలి రోజు పది పరీక్షలు ప్రశాంతం

### - ఆకస్మిక తనిఖీ నిర్వహించిన ఫ్లయింగ్ స్క్వాడ్

వేలేరుపాడు, మార్చి 16( ప్రభాత వార్త ): వేలేరుపాడు మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజు ఉదయం 9:30గంటల నుండి మధ్యాహ్నం 12గంటల 45నిమిషాల వరకు పరీక్షలు జరగనున్నాయి. మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఒకే ఒక్క పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రం నందు మొత్తం 136 మంది విద్యార్థులకుగాను 132మంది హాజరుకాగా నలుగురు విద్యార్థులు గైరాజరైనట్లు అధికారులు తెలియజేశారు. పరీక్షా సమయంలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా తొలి రోజు ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది పరీక్ష కేంద్రాల వద్ద విధులు నిర్వహించారు. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి తెలియజేశారు. పరీక్ష సమయానికి ముందు విద్యార్థులు తల్లిదండ్రులు దేవాలయాలను దర్శించి పది పరీక్షలు మంచిగా రాయాలని కోరుకున్నారు.



## పొట్టి శ్రీరాములు అమరజీవి నిత్య స్ఫూర్తి- పొత్తూరి రామరాజు.

నరసాపురం ప్రభాతవార్త : నరసాపురం పట్టణం లో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఈరోజు పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవి. మహా పురుషుడు, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు. భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు . " అమరజీవి గా గౌరవించబడే ఆయన సామాజిక న్యాయం మరియు దళితుల అభ్యున్నతికి నిబద్ధతతో , వారి హక్కుల కోసం మరియు మతపరమైన ప్రదేశాలకు ప్రాప్యత కోసం ఉపవాసాలు నిర్వహించడం ద్వారా జ్ఞాపకం ఉంచుకుంటాన్నారు . ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవి. మహా పురుషుడు, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు. అని అన్నారు ఈ కార్యక్రమంలో కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్ రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కన్వీనర్ కొలచిన పద్మ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతి నరేష్ జిల్లా టిడిపి నాయకులు అధికార అనంత రామారావు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పొన్నాల నాగబాబు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నాగిడి రాంబాబు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు సంకు భాస్కర్ నాయుడు, పట్నాల జగన్ నర్సాపురం పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ఉద్దగిరి అచ్యుతరామయ్య శివాలయం కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మల్లాడి మూర్తి, బసవని నాగమణి, అలివేలు మంగతాయారు, గుడాల సునీత దొంగ పద్మారావు నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు మావూరి ఆనంద్ కుమార్ పట్టణ ఐటీడీపీ అధ్యక్షులు బొడ్డు సాంబమూర్తి పాతపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు భోగి రెడ్డి ముత్యం, గునిశెట్టి రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం ఎప్పుడు??

మొగల్తూరు మార్చి 16 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామపంచాయతీ మరియు మొగల్తూరు పంచాయతీకి సంబంధించిన స్థలములో నరసాపురం చిట్టవరం సరిపల్లి పాలకొల్లు సంబంధించిన గ్రామాల నుండి లారీలతో టాక్టర్లతో చెత్తను తీసుకుని వచ్చి ఈ స్థలములో గుట్టలు గుట్టలుగా వేసి నిప్పు అంటించడంతో పొగ పెద్ద ఎత్తున పరిసర ప్రాంతాలలో వ్యాపించడంతో సమీపంలో ఉన్న ఇళ్లలోకి వెళ్లడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నామని, అంతేకాకుండా ఈ డంపింగ్ యార్డ్ 216 నేషనల్ హైవేన్ అనుసరించి ఉండటంతో హైవేపై ప్రయాణించే ప్రయాణికులు ఈ పొగ వల్ల రహదారి కనిపించక ప్రమాదాలకు గురవుతున్నామని డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ దత్తత తీసుకున్న గ్రామంలో ఇలాంటి సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తుంది

